# స్వర్గం

● ఈవారం కథ

● రాంరఖి

అంత వరకూ సామాన్యుల్లా బతుకుతున్న జనం ఒకేసారి మాన్యులమైపోదామని ఆకాశంలో మేడలు కట్టడం మొదలెట్టారు.

దాని పర్యవసానమే ఆ ఆస్పత్రి రోగులతో నిండిపోవడం!

ఇప్పుడు డాక్టరు చమత్కారరావుకి క్షణం తీరికుండడం లేదు. గతంలో ఏ ఒక్కరో ఇద్దరో రోగులొస్తే వారికోసం గంటో గంటన్నరో కేటాయించేవాడతను. కాని, ఇప్పుడో!? ఏ ఒక్కరోగినీ పట్టుమని పది నిముషాలైనా పరీక్షించడం అతనికి సాధ్యపడ్డం లేదు.


అందరికీ ఒకటే రోగం...! అందరికీ ఒకటేమందు!!

మహమ్మారిలాటి ఆ రోగాన్ని ప్రజల్లో వదిలిన ఆ మహారోగ పితామహుడ్ని రోజూ తన ఆస్పత్రిలోనే దర్శించుకుని నమస్కరిస్తున్నాడు డాక్టర్ చమత్కారరావు.

* * * *

డాక్టరు పట్టా చేతికొచ్చాక, ఏమైనా సరే సైకియాట్రీలో స్పెషలైజేషన్ చెయ్యాలన్నాడు చమత్కారావు. భారతదేశంలో ఆ జబ్బులు లేవనికాదుగానీ, వున్నా... రోగాలు ఏ కొద్ది మందికో వస్తాయనీ, ఆ రోగం వచ్చిన వాళ్ళల్లో ఏ కొద్ది మందో వైద్యం చేయించుకుంటారనీ అతను వాదించేవాడు. సంప్రదాయ బద్ధంగా క్రమశిక్షణలో బతికే వారికి ఆ జబ్బు అరుదుగా వస్తుందనీ, ఓ వేళా జబ్బొచ్చినా, వ్యాధిగ్రస్తుడు తనకా వ్యాధి వచ్చినట్లు తెలుసుకోలేడనీ, చుట్టు పక్కలవారా వ్యాధిని ఏ దెయ్యమో దేవరో అనుకుంటారనీ అతననేవాడు. బాగా అభివృద్ధి చెందిన ఏ అమెరికావంటి దేశాల్లోనే మానసిక వ్యాధులెక్కువనీ, ఆ దేశాల్లోనే మానసిక వ్యాధి నిపుణులకు ఆదాముంటుందనీ తల్లితో గట్టిగా వాదించాడు. కాని, చమత్కారావు తల్లి చమత్కారావు వాదాన్ని తేలిగ్గా కొట్టి పారేసింది.

చమత్కారావు తండ్రి మానసిక రోగంతో మంచం పట్టాడనీ, యింట్లో ఎవరికీ ఆయన జబ్బు అంతుపట్టక 'భూత, ప్రేత, పిశాచ' వైద్యాలు చేయించి చంపేసారనీ, అటువంటవస్థలు పగవాళ్ళక్కూడా రాకూడదనీ, ఎంతో నచ్చచెప్పి చమత్కారావుని అతని తల్లి సైకియాట్రిస్టుని చేసింది.



ప్రాక్టీసు పెట్టిన కొత్తలో చమత్కారావుకి ప్రతి మనిషీ ఒక మానసిక రోగిలా కనిపించేవాడు. మనుషుల్లో వుండే 'మానరిజమ్స్'నీ 'హేబిట్సు'నీ రోగలక్షణాలనుకునేవాడు. అప్పట్లో చమత్కారావు మేనకోడలు ఎక్కడో చదివిన జోక్‌తో మేలమాడి అతడ్ని ఆటపట్టించేది. "హేయ్! మామయ్యా! మనోదౌర్బల్యంతో ఆకాశంలో మేడలు కట్టుకుని మానసిక రోగులు నివసిస్తారు. నువ్వా మేడలకు అద్దెలు వసూలుచేస్తావు" అని.

ఎప్పుడూ గోళ్ళు గిల్లుకుంటూ కూర్చునే తన శిష్యుడు చమత్కారావు ప్రాక్టీసు విపరీతంగా పెరగడంలోని రహస్యాన్ని తెలుసుకోదలిచి ప్రొ.రామానుజంగారు చమత్కారావుని చూడ్డానికొచ్చారు.

ఆ మాటా – ఈ మాటా అయ్యాక రామానుజంగారు కాఫీ తాగుతూ అన్నారు "ఏంటోయ్ చమత్కారావ్? ఈ చమత్కారం?! మానసికరోగులిలా నానాటికీ పెరిగి పోతున్నారేంటి?" అని.

"ఏముంది సార్! రోజుకో గబ్బు సినిమా రిలీజ్ అవుతుంటే మానసిక రోగులు పెరగరా? నా అదృష్టం పండి ఈ మధ్యే ఓ పిక్చర్ రిలీజు అయింది. ఆ సినిమా చూసిన నాటికి తొంభై

తొమ్మండుగురు నా దగ్గర వైద్యం చేయించుకో వడానికొచ్చేపారు" అన్నాడు నవ్వుతూ చమత్కా రావు.

"వ్వాటేవండర్?! చాలా ఆశ్చర్యంగా వుందే? మరా సినీ నిర్మాతకేం కాలా?" అడిగారు రామా నుజం.

"ఎందుక్కాలా? ప్రస్తుతం ఆ సినీ నిర్మాత డబ్బులుపోయి నా ఆస్పత్రిలో 'యిన్ పేషెంటు' వార్డులో వున్నాడు. రండి వాడిని చూద్దురుగాని!" అంటూ లేచాడు చమత్కారావు. రామానుజంగా రతడ్ని అనుసరించారు.

"సెంటుపెర్సెంట్ సెక్సు! డబల్ మీనింగ్ డ్యూయెట్స్ థౌజండ్‌పెర్సంట్! క్రైమ్ - థ్రిల్ - సస్పెన్సు - సెంటిమెంటు - మసాలా ఫైట్లు టెన్ థౌజండ్ పెర్సంట్! అప్పుడు చూడు నా సామిరంగా!! అన్ని సెంటర్లలోనూ నా బొమ్మకి రికార్డు కలెక్షన్లే కలెక్షన్లు!! సక్సెస్... సెక్సెస్... హిట్... బాక్సాఫీసు హిట్!! హి... హి... డబ్బు... అంతా డబ్బు మయం... హి! హి... హి... హీ...!!

"ఏంటి నిర్మాతగారూ! సినిమాలో రసాలన్నీ కలిపి నూరుపాళ్ళేగా వుండేది. మరి మీ సినిమా థౌజెండ్ పెర్సంట్ అనీ, టెన్‌థౌజండ్ పెర్సంట్ అనీ అంటున్నారేంటి?!" అడిగాడు చమత్కారావు.

"ష్! నా సిన్మా లెక్కల సెపరేటిది. ఛాయిస్ వొదలకుండా అన్నీ చేసేస్తా! అందుకే నా పిచ్చరు కన్ని మార్కులు! హి... హీ...!" అని వివరించాడు నిర్మాత.

"గుడ్! అయితే మీకు మీ సినిమా మీద బోలెడు లాభమొచ్చుండాలే?!"

"వచ్చేదే! కానీ, రాలా!"

"ఏం? ఏమైంది?"

"నేను ఫీల్డుకి కొత్తోడ్ని. నటీ - నటుల దగ్గ ర్నుంచీ, సాంకేతిక వర్గం దాకా అందరూ నా దగ్గర ఒకటికి నాలుగు రెట్లు గుంజేశారు. సారా కాంట్రాక్టులో సంపాదించిన బ్లాక్‌ని వైట్ చేద్దా మనుకుంటే అసలుకే ఎసరెట్టేరు. డిస్ట్రిబ్యూటర్లు ముందుకు రాకుండా బొమ్మ ఫ్లాపవుతుందని గోల చేశారు. అప్పలోళ్ళచేత అల్లరి చేయించి అయినకాడికి బొమ్మ కొనుక్కుని రిలీజిచ్చేశారు. అంతే... డబ్బు లాళ్ళవీ, చిప్పనాదీ అయింది. ఆ! అందుకే ఈసారి డిస్ట్రిబ్యూటర్నీ నేనే అవుతా! నా పిక్చరు నేనే రిలీజిస్తా! ఇదో ఈరోయిమా! ఏటాడావ్సు?! నువ్వెక్సు పోజింగు చెయ్యకుంటే వాయమ్మో! నా నెత్తిన చెంగే! ఓరబ్బ కవో? ఏటా పాట? అందులో డబుల్ మీనింగేదీ? తన్న గొయ్య! ఇలా పాటలు రాస్తే ఇక నా పని తిరపతే! మూజిక్కు డైరేటరూ అద్దదీ! మూజిక్కలా అద రగొట్టు. టక్కు టకా... టక్కు... టకా! శబాష్! అలాగుండాలి. తల్లిపాలు తాగుతున్న చంటోడు లేచి గుక్కపట్టేడవాలి! కతెవడిక్కావాలి? కతన్నీ యిష్టమొచ్చినట్లు మలుపులు తిప్పెయ్యి. అదీ... అలా... అలా కూరు మసాలా! కూరు మసాలా!

"ఇలాటి సినిమాలు తీసి ఎందర్ని పిచ్చాళ్ళని చేస్తావయ్యా?" వుండబట్టలేక అడిగారు రామాను జంగారు.

"ఏంటి? నా సినిమా చూసి జనాలు పిచ్చాళ్ళ వుతారా? ఆళ్ళకి పిచ్చెక్కకుంటే డబ్బులు పోయి నాకు పిచ్చెక్కదా? నేను లచ్చలు పెట్టి సినిమా ఎందుకు తీస్తాను? కోట్లు సంపాదించాలని కదా? జనాలకి కిర్రెక్కించాలి. తీట వుట్టాలి. ఆ తీట వొదిలించుకుందుకు మళ్ళీ మళ్ళీ నా బొమ్మే చూడాలాళ్ళు. అసలు ప్రభుత్వం నొప్పాలేగానీ, ఈ సెన్సారోళ్ళ మధ్యలో ఆ మాత్రమైనా అడ్డం రాకుంటే బ్లూఫిల్ములు తీసి చూపించేస్తాను. చివర్న ఇలాటెదవ పన్లు చేయకండర్రా జబ్బు లంటుకుం టాయనో నీతి వాక్యం తగిలించేస్తాను! హి... హీ! హిహిహీ!"

ఇంక ఆ పిచ్చాడితో ముచ్చటించడం అనవసర మనిపించి డాక్టర్లిద్దరూ వచ్చి మళ్ళీ తమ గదిలో కూచున్నారు.

"సూశారుగా ఆ నిర్మాతని! వాడే నా దేవుడు. వాడిపిక్చరు రిలీజవడంవల్లే నాకిన్ని కేసులు" అన్నాడు నవ్వుతూ చమత్కారావు.

"అది సరేనోయ్! నాకో విషయం అర్థం కావడం లేదు. అతని సినిమాలో నటించిన వాళ్ళకీ, సాంకే తిక వర్గానికీ ఎందుకు పిచ్చెక్కలేదూ?" అని అడి గారు రామానుజంగారు.

"ఏముంది? వెరీ సింపుల్! వాళ్ళందరూ కెటలిటిక్ ఏజెంట్సు. వాళ్ళు మనిషి మెదడులోని రసాయనిక చర్యని ఉధృతం చేస్తారేగానీ, వాళ్ళ మెదడుల్లో కలవరు. అసలీ జబ్బుకు 'హిప్నోథెరపీ' కూడా పనిచెయ్యటల్లేదు" అన్నాడు చమత్కా రావు.

"ఇంతకీ అతను తీసిన సినిమా పేరేంటోయ్?" అడిగారు రామానుజంగారు.

"అదేనండీ! ఆ! 'సావిరంగా! సారంగం.., సారీ! 'సొరగం చూపిస్తాదా!' అట, చెప్పాడు చమత్కా రావు.

"టైటిల్ బావుందోయ్! అసలు స్వర్గానికీ - పిచ్చాళ్ళకీ దగ్గిర సంబంధం వుంది. స్వర్గానికెళ్లి నవాళ్ళు మనక్కనిపించరు. కానీ, ఈ పిచ్చాళ్ళు తమ స్వర్గంలో తాముంటూ మనక్కనిపిస్తారు. అందుకే అంటారు 'ఎవరి పిచ్చి వారికానందమని' ఆ! అదిసరే! ఇంతకీ నువ్వాసినిమా చూశావా?" రామానుజంగారడిగారు.

"నా కెక్కడ తీరికండీ - ఇలాంటి సినిమాలు చూసేందుకు? ఆ సినిమా చూసొచ్చిన పేషం ట్లతోనే సరిపోతోంది. గమ్మత్తేంటో తెలుసాండీ? ఈ సిన్మా చూసిన యువతరం కుర్రకారు నూటికి నూరు మందీ నా దగ్గరకొచ్చేస్తున్నారు. ముసి లాళ్ళల్లో ఓ ఫైవ్ పెర్సెంటూ, వడుచువాళ్ళు, పెళ్ళైనవాళ్ళల్లో ఓటెన్ పెర్సెంటుకే ఈ వ్యాధొ స్తోంది. గురుడు ఆ మాత్రమైనా జనాల్నొదిలాడు. ఎందుకంటే నా దగ్గరికి పేషెంట్సుని తీసుకొచ్చేటం దుకైనా కొందరారోగ్యంగా వుండొద్దా!" నవ్వాడు చమత్కారావు.



"అసలా సినిమాలో ఏముందో కనుక్కోలేక పోయావోయ్ జనాల్ని" అడిగారు రామానుజం గారు.

"ఆ! అదీ అయింది. ఆ సినిమా అంతా ఓ సొరంగంలో నడుస్తుంది. సొరంగం ఇవతల్నుంచి అవతలికెళితే స్వర్గం వుంటుందిట! సెన్సారు కత్తెర వెయ్యడానికి సాధ్యం కాకుండా చాలా తెలివిగా కథ - మాటలూ కూర్చార్ట. ఏ బిట్ కట్‌చేసినా సినిమా కథ అర్థం కాదట. ఏవేవో చెప్పి సెన్సారు వాళ్ళని ఏమీ చెయ్యలేని అయోమయంలో పడేశారు" చెప్పాడు చమత్కార్రావు.

"బాగుంది! మరీ సిన్మా చూసిన సెన్సారుబోర్డుకెందుకు పిచ్చెక్కలా?" అడిగారు రామానుజం గారు.

"అదేమిటి సార్! అలా అన్నీ తెలీనట్టడుగుతారు. సెన్సారు బోర్డు సభ్యులు 'ఇమ్యూన్‌సిండ్రోమ్స్!' ఇమ్యూన్ సిండ్రోమ్స్ గూర్చి మీకు తెలీదేముంది చెప్పండి. వాళ్ళు మహా తపస్సంపన్నులు. వాళ్ళ చర్మం చాలాదళసరి. ఏం చూస్తున్నా ఏం వింటున్నా అవేవీ వాళ్ళ బుర్రకెక్కవు. వాళ్ళెప్పుడూ సజీవ సమాధుల్లో వుంటారు. ప్రపంచం గొడవ వాళ్ళకి పట్టదు. అన్నిటిలోనూ దైవాన్ని చూస్తారు. దేవాలయం మీదుంటే బూతుబొమ్మల్ని పట్టించుకోనట్టే అతీతంగా వుంటూ సినిమాలను చూడ్డం నేర్చుకొనుంటారు. పైగా అన్నీ అలాటి సినిమాలే చూస్తూ పోవడంతో అసలు సినిమా అంటే అలాగే వుండాలి కామోసునవే పరిస్థితికి దిగజారారు! వివరించాడు చమత్కార్రావు.

"చాలా చక్కగా విశ్లేషించావోయ్ చమత్కార్రావ్! నౌ అయామ్ ప్రౌడ్ ఆఫ్‌యూ! మనం మానసిక ఉద్రిక్తతల్ని తగ్గించేందుకు చూస్తే, ఈ సినిమా ఉద్రిక్తతని పెంచేందుకు చూస్తోంది. మనిషిలోని నేరప్రవృత్తికి కారణం మానసిక రుగ్మతగా మనం భావిస్తాం! నేర ప్రవృత్తిని పెంచే సినిమాలు ఏ విధంగా మనిషిని ఉద్రేకపరుస్తాయో తెలుసుకుంటే వైద్యం మరింత సులువవుతుంది. నువ్వెలాగైనా ఆ సిన్మానోసారి చూసి థీసెస్ సబ్మిట్ చెయ్యి! నా శిష్యుడివైన నీకు తప్పకుండా పిహెచ్.డి. యిస్తాను" పోతూ పోతూ చమత్కార్రావుని ప్రోత్సహించి మరీ పోయారు రామానుజంగారు.

చమత్కార్రావు తల్లి బతికుంటే ఛస్తే చమత్కార్రావునాసిన్మా చూడనిచ్చేది కాదు. ఎందుకంటే... చమత్కార్రావు మాతామహుడు మానసిక రోగంతో మరణించాడు. వాళ్ల ఫ్యామిలీలో ఎక్కడో ఆ జీన్ వుండుంటుందని ఆమె భయం.

కాని...

రామానుజంగారి మాటలు చమత్కార్రావుపై ప్రభావం చూపాయి. అతనికి పిహెచ్.డి. తీసుకోవాలనే ఆశ కలిగింది. అందుకే అతనా రాత్రే ఆ సిన్మా వీడియో క్యాసెట్ తెచ్చుకుని తన ప్రైవేట్ రూమ్‌లో ప్లే చేసి చూశాడు.

మర్నాడేం జరిగిందో ఇప్పటికే అందరికీ అర్థమై వుంటుంది. చమత్కార్రావుతో సహా అతని పేషెంట్సందరూ రామానుజంగారి ఆస్పత్రిలో ఇన్-పేషెంట్సుగా ఎడ్మిట్ అయ్యారు.

[సైకో స్వర్గాలను అరికట్టవలసిన బాధ్యత సభ్య సమాజం చేపట్టనంత వరకూ మరింత మంది స్వర్గ స్థులవుతుంటారు - రచయిత.]

## ఆణిముత్యాలు

విప్లవం చేసి ప్రజల్ని సుఖపెట్టగలరనటం—

ప్రసవించటం కంటె గర్భస్రావం వల్లే మంచి పిల్లలు పుడతారన్నట్టు వుంటుంది.

◆

అపవాదుకున్న ఆకర్షణ ఈ ప్రపంచంలో ఆడదానికి లేదు.


— గోపీచంద్


FREE !



17 LTR. ST. STEEL
DOUBLE CANDLE WATER FILTER
WORTH Rs. 665

WITH EVERY RAMA SELF LIGHTING LPG STOVE



10 YEARS WARRANTY

Enjoy the benefits of Rama Stainless Steel Gas Stove and Water Filter

Rama LPG stoves available in 3 models. Self-lighting, Popular and Regular.

- Needs no match box or lighter.
- Sim facility.
- Pilot jet flame.
- 18-G Salem Stainless Steel.
- Aluminium mixing tube.
- High fuel efficiency (68% +).
- Imported electronic piezo for automatic ignition and life long service.

RAMA®
SALEM STAINLESS STEEL LPG STOVES

Marketed in A.P. by:
Mahavir Enterprises (India) Limited.
"DHAROD HOUSE", Bogulkunta, HYDERABAD-500 001.
Ph: 231198/242650/599843/240729.

AVAILABLE AT ALL LEADING STORES.

ULKA-50199